# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 73 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

06-01-2026 మంగళవారం వెల : 1/- పేజీలు : 4






## 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు

### మంత్రి నాదెండ్ల మనోహర్

**నవతరం -శ్రీకాకుళం**

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నామని, రైతు సంక్షమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. సోమవారం శ్రీకాకుళం జిల్లాలో పర్యటించిన ఆయన పలు ధాన్యం సేకరణ కేంద్రాలను, గోదాములు, రైస్ మిల్లులను తనిఖీ చేసి, రైతులతో ముఖాముఖి మాట్లాడారు. మంత్రి తన పర్యటనలో భాగంగా తొలుత అరసవెల్లిలోని మండల స్థాయి పౌరసరఫరాల గోదామును తనిఖీ చేశారు. అక్కడ అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రజా పంపిణీ వ్యవస్థ (పి డి ఎస్) ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న చక్కర ప్యాకెట్లను స్వయంగా తూకం వేసి పరిశీలించారు. అనంతరం గార మండలం రామచంద్రాపురంలోని శ్రీనివాస రైస్ మిల్లును సందర్శించి మిల్లర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణపై రామచంద్రాపురం పరిసర గ్రామాల్లో రైతులతో ముచ్చటించగా, డబ్బులు కేవలం 4 గంటల్లోనే పడ్డాయని రైతులు చెప్పడంతో మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. మిల్లుల వద్ద తరుగు, తేమ పేరుతో వేధింపులు ఉన్నాయా అని ఆరా తీయగా, అలాంటి ఇబ్బందులేమీ లేవని రైతులు బదులిచ్చారు.

### గత ప్రభుత్వ బకాయిలను మేమే తీర్చాము:

గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన సుమారు రూ. 1674 కోట్ల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పూర్తిగా చెల్లించి రైతులను ఆదుకుందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే రూ. 1000 కోట్లు, రెండో నెలలో మిగిలిన రూ. 674 కోట్లు విడుదల చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 38 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తయిందని తెలిపారు. దీని ద్వారా సుమారు 6 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 9,300 కోట్లను కేవలం 24 గంటల్లోనే జమ చేశామని వివరించారు. ఇక శ్రీకాకుళం జిల్లా విషయానికొస్తే.. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యనికి గానూ ఇప్పటివరకు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, రూ. 1200 కోట్లను రైతుల ఖాతాలకు చేరవేశామన్నారు. జిల్లాలో మిగిలిన 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియలో రైతులకు, మిల్లర్లకు, హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

### కొత్త సంస్కరణలు.. మరిన్ని సౌకర్యాలు:

సిమ్మపేట గ్రామంలో జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. రైతులకు ఉచితంగా తార్పాలిన్లు పంపిణీ చేస్తున్నామని, పట్టణాల్లో ప్రయోగాత్మకంగా రూ. 20కే కిలో గోధుమపిండి అందిస్తున్నామని తెలిపారు. స్పందనను బట్టి ఈ పథకాన్ని గ్రామాలకు విస్తరిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 34 వేల పాఠశాలలు, 4 వేల సంక్షమ హాస్టళ్లకు సన్నబియ్యాన్ని సరఫరా చేస్తున్నామని గుర్తుచేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ కృషితో ఈ ప్రాంత సమస్యలు పరిష్కారమవుతున్నాయని కొనియాడారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. తుపాను ప్రభావంతో ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పక్కా ప్రణాళికతో ధాన్యం సేకరణను వేగవంతం చేశామని వివరించారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. గతంలోలా వాహనాల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా, 15 రోజుల్లో ఎప్పుడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ ఎండీ సేనాపతి ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, జిల్లా పౌర సరఫరాల అధికారి జి. సూర్య ప్రకాశరావు, మేనేజర్ వేణుగోపాల్, శ్రీకాకుళం తహసీల్దార్ గణపతి రావు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి




- అడ్వకేట్స్ కు జుడీషియల్ అకాడమి పెట్టాలి
- ఆశ్రా సేవలను అందిపుచ్చుకోవాలి
- ఆశ్రా జాతీయ ఫౌండర్ అధ్యక్షులు, సుప్రీం కోర్టు న్యాయవాది హబీబ్ హలీ సుల్తాన్

**నవతరం -శ్రీకాకుళం**

అడ్వకేట్స్‌కు జుడీషిల్ అకాడమీ స్థాపించాలని ఆశ్రా జాతీయ ఫౌండర్ అధ్యక్షులు, సుప్రీం కోర్టు న్యాయవాది, హబీబ్ హలీ సుల్తాన్ కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా ఆశ్రా కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. త్వరలో జరగనున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తన విజయానికి సహకరించాలని న్యాయవాదులను ఆయన కోరారు. ఈ సంస్థను 2016లో స్థాపించడం జరిగిందని దీని ద్వరా అన్ని వర్గాల ప్రజలకు న్యాయపరంగా ఎదురయ్యే ఇబ్బందులను ఎలాంటి ఆర్థికంగా ఆశించకుండా తమ సంస్థ ద్వారా సమస్యలు పరిష్కరించేందుకు చొర తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తమ సంస్థ ద్వారా బాదితుల హక్కుల రక్షణ కొరకు రాజ్యాంగ బద్ధంగా న్యాయం జరిగేలా తాము కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 230కేసులకు పైగా బాధితులకు న్యాయం చేయగలిగామన్నారు. ఆశ్రా ద్వారా 2,800ల కు పైగా కేసులను అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఇప్పటికే తమ సంస్థ 9రాష్ట్రాల్లో విస్తరించిందన్నారు. అధికంగా శ్రీకాకుళం జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. ఆశ్రా ప్రతీ ఏడాది ఒక్కోరాష్ట్రంలో పెద్ద సమావేశం నిర్వహించి న్యాయ సలహాలు అందిస్తున్నామన్నారు. తమ సంస్థలో పదవిలా కాకుండా ఒక సేవా సంస్థగా పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం తాను ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యత్వానికి పోటీలో ఉన్నానన్నారు. తమ సంస్థ అందిస్తున్న సేవలను జిల్లాలోని అందరి అడ్వకేట్‌లకు వివరించడం జరుగుతుందన్నారు. యువ న్యాయవాదులకు కేసులపై అవగాహన కల్పించే వేదిక ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆశ్రా ద్వారా ఏడాదికి 200లకు పైగా యువ న్యాయవాదులకు అవగాహన విధానాలను వివరించడం జరుగుతుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏడాదికి 500 మంది యువ న్యాయవాదులను ఆశ్రాలోకి తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. యువ న్యాయవాదుల ద్వారానే కేసులను ఫైల్ చేసి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా ఆశ్రా అధ్యక్షులు, అడ్వకేట్ డాక్టర్. గంజి ఆర్ ఎజ్రా, ఉపాధ్యక్షులు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్, న్యాయవాది. జి. ఇందిరా ప్రసాద్, అడ్వకేట్ పార్థశారధి, కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, నీలి కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## కిష్టప్పపేటలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

### సమాజ సేవకు ఎన్‌ఎస్‌ఎస్ ఎంతో దోహదం -గొండు శంకర్

**(నవతరం శ్రీకాకుళం)**

నగరంలోని ఎల్‌ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్-ఎస్ రెండవ యూనిట్ ఆధ్వర్యంలో కిష్టప్పపేటలో వారం రోజులపాటు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్ తెలిపారు. శిబిరాన్ని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ ప్రారంభించి మాట్లాడుతూ ఉత్తమమైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల మా గ్రామాన్ని ఎంచుకోవడం ఆనందంగా ఉందని,యువత గ్రామాభివృద్ధిలో భాగం అవ్వడం నేటి సమాజానికి ఎంతో అవసరం,కాబట్టి ఈ వారం రోజులు కాలేజీ వాళ్ళు నిర్వహించే కార్యక్రమాలు గ్రామానికి,ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతా




యని వాటిని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు .కార్యక్రమం లో కళాశాల ఎన్‌ఎస్ పిఓ లు హరిమానస, పైడిరాజు, ఎపిఓ జగన్నాథం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన టెక్కలి టైక్వాండో టైగెర్స్, చీఫ్ కోచ్ ఎన్. శేఖర్ మాస్టర్

2లో





## నైతికతే నమ్మకం యూనియన్ బ్యాంక్ నడక ర్యాలీ

- నైతిక విలువలు, పారదర్శక సేవలపై అవగాహన
- శ్రీకాకుళంలో యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల భారీ నడక ర్యాలీ
- ఖాతాదారుల సేవల్లో ముందంజలో ఉన్నాం : రీజనల్ హెడ్ పైడి రాజా

2లో



ఎడిటోరియల్

# నయా సాల్ కా సవాల్...

క్యాలెండర్‌లో ఒక సంవత్సరం అంతర్ధానమైంది. దాని స్థానంలో న్యూ ఇయర్ వచ్చి చేరింది. దేశంలోను, రాష్ట్రంలోనూ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణలో నయా సాల్ రాక సందర్భంగా రూ.వెయ్యి కోట్ల మేర లిక్కర్ అమ్మకాలు కొనసాగాయన్నది అధికారికవర్గాల లెక్క. దీన్నిబట్టే వేడుకలు 'ఏ స్థాయి'లో జరిగాయో తెలుసుకోవచ్చు. వేడుకలు, సంబురాల మాటెలా ఉన్నా.. కొత్త సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రానికి, ఇక్కడి ప్రజలకు అనేకానేక సవాళ్లు ఎదురుకానున్నాయి. వీటిని ఎదుర్కోవటం, పోరాడటం, పరిష్కరించుకోవటమనే బృహత్తర కర్తవ్యం మనమీద ఉంది.పాత సంవత్సరం పోతూపోతూ మన రాష్ట్రంలోని పేదలు, ముఖ్యంగా దళితులు, గిరిజనులు, బలహీనవర్గాల వారికి ఊతమిచ్చిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టా (నరేగా) నికి ఉరేసిపోయింది. దేశవ్యాప్తంగా యాభై శాతం మహిళా కూలీలు నరేగా ద్వారా ఉపాధి పొందితే.. తెలంగాణలో అది అరవై రెండు శాతంగా నమోదైంది. దీన్నిబట్టి రాష్ట్రంలోని మహిళలకు 'ఉపాధి' ఏ విధంగా ఊతమిచ్చిందో అర్థం చేసుకోవచ్చు.ఇంతటి ప్రాముఖ్యమున్న ఈ చట్టం పరిధిలో తెలంగాణలో ఐదు కోట్ల పనిదినాలకు కోతపెట్టిన మోడీ సర్కార్ దాన్ని చావు దెబ్బ కొట్టింది. బీహార్‌లో మాదిరిగా తెలంగాణలోనూ 'సర్'ను అమలు చేసి తీరతామంటూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన దరిమిలా.. ఇతర రాష్ట్రాల్లో దాని పర్యవసాలను చూసిన మనకు ఇక్కడ ఏం జరగబోతోందో చెప్పాల్సిన అవసరం లేదు. విద్యుత్ సవరణ చట్టాలు తెలంగాణకు గుదిబండగా మారనున్నాయి. అవి అమల్లోకి వస్తేరైతులు, పేదలకు ఇస్తున్న ఉచిత కరెంటుకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వాల్సి వస్తుంది. విద్య, వైద్య తదితర సంస్థలకు ఇచ్చే క్రాస్ సబ్సిడీకి కత్తెరలు పడతాయి. నూతన విత్తన ముసాయిదా చట్టం విత్తనోత్పత్తి రాష్ట్రమైన తెలం గాణకు శాపంగా మారబోతోందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ కొత్త సంవత్సరంలో మనకు గుదిబండలుగా మారనున్నాయి.కేంద్ర ప్రాయోజిత పథకాల్లో తన వాటాలను క్రమక్రమంగా తగ్గిస్తూ వస్తోన్న మోడీ ప్రభుత్వంఆ మేరకు రాష్ట్రాలపై పెను భారాలు మోపేందుకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా ఇరవై వేల కోట్ల రూపాయల భారం రాష్ట్ర ఖజానాపై పడనుంది. ప్రభుత్వం చెబుతున్న రూ. 8.50 లక్షల కోట్ల అప్పు, అందుకు సంబంధించి అసలు, వడ్డీ కలిపి సగటున నెలకు రూ.6,600 కోట్లు చెల్లిస్తున్న క్రమంలో ఇప్పుడు అదనంగా వచ్చిపడ్డ వేల కోట్ల భారం.. రాష్ట్ర ప్రభుత్వ నడ్డి విరగొట్టటం ఖాయం. గత ప్రభుత్వ హయాంలో అనేకానేక హామీలు అమలు కాలేదని ప్రజలు.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పగ్గాలు అప్పగించారు. రేవంత్ రెడ్డి సర్కారుకు ఇప్పుడు రెండేండ్లు పూర్తయ్యాయి. ఆరు గ్యారెంటీల అమలు నత్తనడకన సాగుతోందనే విమర్శలు ఇప్పటికే వెల్లువెత్తుతున్నాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. మన వాటాలను సరిగ్గా చెల్లించకపోవటంతో కేంద్రం నుంచి వివిధ పథకాలకు రావాల్సిన మ్యాచింగ్ గ్రాంట్లు రావటం లేదనే అపవాదు ఉండనే ఉంది.నిర్ణయాలు తీసుకోవటంలో వేగం, తాజాదనం కొరవడుతున్నాయనే సంకేతాలు బలంగా వినబడుతున్నాయి. మోడీ 'వికసిత్ భారత్ -2047' మాదిరిగానే 'తెలంగాణ విజన్ డాక్యుమెంట్' ఉంది తప్ప కొత్తదనమేమీ లేదని ఆర్థిక నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఆ డాక్యుమెంట్‌లోని ప్రణాళికలు ప్రజలు కేంద్రంగా లేవనే వాదనలు కూడా వినబడుతుండటం గమనార్హం. చాలినన్ని ఆర్థిక వనరులు లేకుండా అందులోని లక్ష్యాలను ఏ విధంగా చేరుకోగలమన్న ప్రశ్నలూ ఉత్పన్నమవుతున్నాయి. ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుల సృష్టిపై కూడా సర్కారు దృష్టి పెట్టలేదన్నది కాదనలేని వాస్తవం. కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన తెలంగాణ ప్రభుత్వం ఈ సవాళ్లన్నింటినీ ఎలా అధిగమిస్తుందనేది కూడా పెద్ద సవాలే. ఒకవైపు నిధులు, విధులు, అధికారాల కోసం కేంద్రంపై పోరాడటం, మరోవైపు తన పరిపాలనలోని వైఫల్యాలను ఎప్పటికప్పుడు సరిచేసుకోవటం కాంగ్రెస్ ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. తన పాలనకు రెండేండ్లు పూర్తయిన సందర్భంలో ఇంకా ఆత్మస్తుతి, పరనింద అనే మూస ధోరణిని పక్కనబెట్టి, ఇక నుంచైనా పాలనపై పూర్తి స్థాయిలో అది దృష్టి కేంద్రీకరిస్తుందా? లేదా? అనేది వేచి చూడాలి.

# జన్యు శాస్త్ర పిత

పిల్లలు తమ తల్లి దండ్రుల నుండి జన్యు సమాచారాన్ని ఎలా పొందుతారు అనే ప్రక్రియని వారసత్వంగా చెప్పవచ్చు. వంశపారంపర్య ప్రక్రియ మొత్తం వారసత్వంపై ఆధారపడి ఉంటుంది. సంతానం తల్లిదండ్రులను పోలి ఉండడానికి ఇది ప్రధాన కారణం. వారసత్వం కారణంగా, ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు కొద్దిపాటి తేడాతో ఒకే విధమైన లక్షణాలను కలిగి ఉంటారని దీని అర్థం.

19వ శతాబ్దం మధ్యలో మాత్రమే ప్రజలు వారసత్వాన్ని సరైన రీతిలో అర్థం చేసుకోవడం ప్రారంభించారు. వారసత్వం గురించి ఈ అవగాహన గ్రిగర్ మెండెల్ ద్వారా సాధ్యమైంది, అతను వారసత్వాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని నియమాలు రూపొందించారు, వీటిని మెండెల్ వారసత్వ నియమాలు అంటారు.


యం.రాం ప్రదీప్

మెండెల్ తన ప్రయోగాలలో బఠానీ మొక్కలను ఎంచుకున్నారు. ఎందుకంటే బఠానీ మొక్క విభిన్నమైన గమనించదగ్గ లక్షణాలను కలిగి ఉంది. దీనిని పెద్ద సంఖ్యలో సులభంగా పెంచవచ్చు. దాని పునరుత్పత్తిని మార్చవచ్చు. అలాగే, బఠానీలో మగ,ఆడ పునరుత్పత్తి అవయవాలు ఉన్నాయి, కాబట్టి అవి స్వీయ-పరాగసంపర్కం, క్రాస్-పరాగసంపర్కం చేయగలవు.మెండల్ చేసిన పరిశోధనలవల్ల అనువంశికత ఏ విధంగా ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమిస్తుందో తెలిసింది..అందువల్లే మనం మెండల్ ని జన్యుశాస్త్ర పితఅనివ్యవహరిస్తున్నాం.ఆయన జీవించి ఉన్న కాలంలో సరైన గుర్తింపు రాలేదు. చనిపోయిన తర్వాత మెండల్ కు ఈ గుర్తింపు లభించింది.

జూలై 20, 1822న ఆస్ట్రియాలోని హీన్‌జెండార్ఫ్‌లో ఒక వ్యవసాయ కుటుంబంలో గ్రిగర్ జోహన్ మెండెల్ జన్మించారు. మెండెల్ నిరాడంబరంగా పెరిగారు.పదకొండు సంవత్సరాల వయస్సులో స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు, యువ మెండెల్ యొక్క తెలివితేటలతో ముగ్ధుడై, అతని విద్యను కొనసాగించడానికి అతనిని పాఠశాలకు పంపమని కుటుంబాన్ని ప్రోత్సహించారు..

1856-1863 మధ్యకాలంలో, సుమారు 28,000 బఠానీ మొక్కలపై పరిశోధనలు చేసి, లక్షణాలు తరం నుండి తరానికి ఎలా సంక్రమిస్తాయో కనుగొన్నారు.1900 ప్రాంతంలో మెండల్ ప్రతిపాదలలు సరైనవేనని ఎంతో మంది ధృవీకరించారు.

సంతానం తల్లి దండ్రులనే పోలి ఉన్నా కొన్ని విషయాలలో తేడాలను చూపుతుంది. ఈ లక్షణం వైవిధ్యంగా రూపొందుతుంది. ఈ వైవిధ్యానికి జన్యువులే కారణం. అంతే కాదు యీ వైవిధ్యం వల్లే పరిణామం సంభవం ఇవన్నీ ఇప్పుడు తేలికగా చెప్పేస్తున్నారు కాని మెండల్ కాలానికి ఏమీ తెలియదు. అలాంటి పరిస్థితిల్లో అమూల్యమైన విషయాలను మెండల్ చెప్పినప్పటికీ ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవటం విచారకరం. ఏదీ ఏమైనా ఆయన ప్రతిపాదనలే ప్రస్తుతం నిత్య సత్యాలుగా వెలుగుతున్నాయి. అవే ఆయనను చరితార్థుడ్ని చేశాయి.ఆయన 1884జనవరి 6న తుది శ్వాస విడిచారు.

(జనవరి 6-మెండల్ వర్ధంతి )

## రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన టెక్కలి టైక్వాండో టైగెర్స్. చీఫ్ కోచ్ ఎన్. శేఖర్ మాస్టర్

**నవతరం టెక్కలి**

34 వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ టైక్వాండో పోటిల్లో టెక్కలి క్రీడాకారులు హావ.... శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈ నెల 3,4తేదీల్లో స్థానిక వైయస్సార్ కళ్యమండపం లో ఈ పోటీలు జరిగాయిఅని ఈ పోటీలకు రాష్ట్ర నాలుమూలలు నుండి బాల బాలికలు తమ ప్రతిభ చూపించిగా టెక్కలి మరియు పలాస కు చెందిన కిషోర్ స్కూల్స్ అఫ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చి 06 స్వర్ణ పతకాలు, 03 వెండి పతకాలు మరియు 13 రజత పతకాలు సాధించారని చీఫ్ కోచ్ శేఖర్ మాస్టర్ తెలిపారు. అంతకు ముందు పలాస ఎమ్మెల్యే గౌతు శీరీష ఇటీవలే స్పోర్ట్స్ కోట లో ఎం బి బి ఎస్ సీట్ పొందిన టైక్వాండో క్రీడాకారిణి పులిబంద జాశ్విక ను శాలువా తో సన్మానించారు, ఈ పోటిల్లో ఈ విజయం సాధించి పెట్టిన కోచ్ పాండవులు జగదీష్, సురేష్, ముడిదాన ఢిల్లేశ్వర్ రావు, కుమార్, జాశ్విక, అక్ష మరియు అభిషేక్ కు, చీఫ్ కోచ్ నర్సిపురం శేఖర్ అభినందనలు తెలిపారు.

## నైతికతే నమ్మకం యూనియన్ బ్యాంక్ నడక ర్యాలీ

**నవతరం శ్రీకాకుళం**

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో, రీజనల్ హెడ్ శ్రీ పైడి రాజా గారి నాయకత్వంలో జనవరి 1వ తేదీ నుంచి జనవరి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న నైతికత మరియు అనుపాలన వారోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీకాకుళంలో అవగాహన నడక ర్యాలీ ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం కోడి రామమూర్తి స్టేడియం నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు ఈ నడక ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని నైతిక విలువలు, పారదర్శకత ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీజనల్ హెడ్ శ్రీ పైడి రాజా మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక ప్రభుత్వ రంగ బ్యాంకుగా ఖాతాదారుల నమ్మకాన్ని మూలస్తంభంగా తీసుకొని లావాదేవీలు నిర్వహిస్తున్నదని తెలిపారు. సేవలందించడంలో పారదర్శకత, నైతికత, బాధ్యతాయుత వ్యవహారం ప్రధాన లక్ష్యలుగా ముందుకు సాగుతున్నామని అన్నారు. శ్రీకాకుళం రీజియన్ ప్రజలందరూ యూనియన్ బ్యాంక్ అందిస్తున్న విశ్వసనీయ సేవలను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు గాయత్రి, విశ్వనాథ్, ప్రసాద్, చైతన్య, పాడి, నరేష్, ఎల్‌డీఎం శ్రీనివాస్, అధికార సంఘ నాయకులు రాజశేఖర్, ఉద్యోగ సంఘ నాయకులు శ్రీనివాసులు, కరుణతో పాటు అధికారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

- కూలి చెల్లింపు విషయంలో తన వాటా తగ్గించుకున్న కేంద్రం.
- వికసిత్ భారత్ వీబీజీరామ్ జీ గ్రామ సభలో సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి రాజేశ్వరరావు.

**నవతరం-సంతకవిటి**

మండలంలోని కావలి గ్రామంలో వికసిత్ భారత్ వీబీజీరామ్ జి గ్రామ సభ సోమవారం జరిగింది. ఈ సభలో కావలి గ్రామ సర్పంచ్ ప్రతినిధి రాజేశ్వరరావు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించడమే లక్ష్యంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్ వీబీజీ రామ్ జీగా మార్పు చేసిందని, పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. ఉపాధి పనులను గ్రామస్థులంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ రచ్చబండ వద్ద సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 100 రోజుల పని కల్పన నుంచి ప్రతి కుటుంబానికి 125 రోజుల పని దినాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం వాటాను 90




శాతం నుంచి 60 శాతానికి తగ్గించుకోవటం సరికాదని, ఆ పథకాన్ని నీరుగార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. గ్రామీణ ప్రజల వలసలు తగ్గించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పూర్తిగా నీరుగార్చటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. గ్రామంలో ఇప్పటివరకు జరిగిన చెరువుల పూడికతీత, ఫీల్డ్ ఛానల్స్ నిర్మాణం, మొక్కల పెంపకం మునుపు జరిగిన పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు ఉపాధి హామీ కూలీల వేతనాలు ఎటువంటి ఆలస్యం లేకుండా నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు, పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ జాబ్ కార్డు పొంది, తాను లబ్దిపొంది , గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి రాజేశ్వరరావు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# కార్పొరేట్ల దోపిడీ కోసమే కాగర్ యుద్ధం

### సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో కొండలోగాంలో ఘనంగా కామ్రేడ్ సవర చిలకమ్మ 30వ వర్ధంతి సభ




**నవతరం-మందస**

అటవీ సంపదను బహుళ జాతి సంస్థలకు కట్టబెట్టడానికే మోదీ అమిత్ షా నేతృత్వంలోని మతోన్మాద బిజెపి పాలకులు కగారు పేరుతో ఆదివాసీలను, మావోయిస్టులను పెద్ద ఎత్తున చంపేస్తున్నారని, ఇది అత్యంత దుర్మార్గమైనదని సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు పేర్కొన్నారు. మందస మండలం కొండలోగాం ఆదివాసీ గ్రామంలోని సవర చిలకమ్మ స్తూపం వద్ద సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ నిర్వహించిన 30 వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు గౌరకల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాధవరావు తో పాటుగా ఐఎఫ్టియు జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి, పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు సొర్ర రామారావు, ఆదివాసి నాయకులు సవర బంగ్లాకుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు మామిడి భీమారావు తదితరులు మాట్లాడుతూ విస్తారంగా ఉన్న అటవీ సంపదను, ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్రంలో ఉన్న మోదీ అమిత్ షా నేతృత్వంలో పాలకులు అదాని, అంబానీకు అడవులను కట్టబెట్టడానికి సహజ వనరులను వారికి అప్పనంగా అప్పగించడానికి అందుకు అడ్డుగా ఉంటున్నటువంటి ఉద్యమకారులను, ఆదివాసీలను నిర్దాక్షణ్యంగా కాల్చి చంపుతున్నారని వారు మండిపడ్డారు. ప్రకృతి పర్యావరణానికి విఘాతం కలిగించి, పచ్చదనాన్ని సర్వనాశనం చేసే ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో అనేక మంది మేధావులు, ఉద్యమకారులు ప్రజాస్వామి క వాదులు పోరాడుతున్నారని అన్నారు. కామ్రేడ్ సవర చిలకమ్మ సాధారణ ఆదివాసి కుటుంబంలో పుట్టి శ్రీకాకుళ సాయుధ పోరాట కాలంలో పార్టీకు, దళాలకు కొరియర్ గా పనిచేశారని గుర్తు చేశారు. కామ్రేడ్ చిలకమ్మను స్మరించడం అంటే ఆమె అందించిన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడమేనని పిలుపునిచ్చారు. ఆదివాసి గ్రామాలన్ని 5వ షెడ్యూల్లో చేర్చాలని, 1/70 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఆదివాసి ప్రాంతాలన్నీ నాన్ షెడ్యూల్ గా మిగిలి ఉన్నాయనీ, నాన్ షెడ్యూల్ ఆదివాసి గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, ఆదివాసి ప్రాంతంలోని భూములు దురాక్రమణకు గురవుతున్నాయన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారుశ ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాల మీద పెద్ద ఎత్తున హిందూ మతం పేరుతో మనువాద పాలకులు దాడి చేస్తున్నారని, బలవంతంగా హిందూ మత సంస్కృతిలో భాగం చేస్తున్నారని, ఆదివాసుల అస్తిత్వాన్ని, వారి సంస్కృతిని, వారు సాంప్రదాయాలను కాపాడాలని అందుకు ప్రజా ఉద్యమాలే శరణ్యమని అన్నారు. పోరాడితేనే హక్కులు సాధించబడతాయని ఆదివాసీలంతా సంఘటతమై ఆడవు లను, అటవీ సంపదను కాపాడుకోవాలన్నారు . 5వ షెడ్యూల్ 1/70సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సభలో సారా జగన్ ( పి వై ఎల్) వంకల పాపయ్య, రాపాక మాధవరావు, అప్పయ్య, బర్ల గోపి, జానకమ్మ, దాసు, రాజారావు, పున్నయ్య, డొంబురు,చిలకమ్మ మనవడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆది విష్ణువు కాళ్లకు పట్టీలు, మెట్టెలు కడియాలు ఉన్న ఆలయం - యాదాద్రి భువనగిరి జిల్లా



ఆదివాహావిష్ణు ఆలయం అనేది యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలో నెలకొని ఉన్న హిందూ దేవాలయం ఇక్కడ కొలువైన కాకతీయుల కాలం నాటి ఆదిష్ణు విగ్రహం 2015 వ సంవత్సరములు ఉపాధి హామీ కూలీలు పని నిమిత్తం నవ్వుతుండగా తవ్వకాల్లో బయటపడటం విశేషం.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం, దేవలమ్మనాగారంలో కొండపైన ఉన్న మహావిష్ణువు ఆలయాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరతాయని అంటారు. పచ్చని ప్రకృతి మధ్య...భక్తులను ఆకట్టుకునేలా శ్రీదేవీ, భూదేవీ సమేతంగా దర్శనమిచ్చే ఈ స్వామిని జగన్మోహినిగానూ కొలుస్తారు. అందుకే స్వామి కాళ్లకు పట్టీలు, మెట్టెలు, కడియాలు అలంకరిస్తారు. విష్ణుమూర్తి దాల్చిన దశావతార రూపాలన్నీ ఇక్కడున్న విగ్రహంలో కనిపిస్తాయట. తెలంగాణలో ఏకైక ఆది విష్ణు ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

## స్థల పురాణం

స్థల పురాణం ప్రకారం ఈ ఆలయంలోని విగ్రహానికి 100 సంవత్సరాల చరిత్ర ఉన్నట్టుగా ఇక్కడున్న శిలాశాసను ద్వారా తెలుస్తోంది. అయితే ఆ విగ్రహం ఎక్కడిదనేది ఎవ్వరికీ తెలియదని స్థానిక పూజారులు చెబుతారు. కొన్ని సంవత్సరాల క్రితం ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ఖాళీగా ఉన్నారని ఉద్దేశంతో ప్రస్తుతం ఆలయం ఉన్న కొండ ప్రాంతాన్ని తవ్వి రోడ్డు మార్గం వేయమంటూ గ్రామ పెద్దలు పురమాయించారట. అలా తవ్వే క్రమంలోనే ఇక్కడ స్వామి విగ్రహం దాంతోపాటు శిలాశాసనం బయటపడ్డాయట. అరుదైన విష్ణుమూర్తి విగ్రహం కావడం దానిపైన దశావతార రూపాలు ఉండటం విగ్రహం చెక్కుచెదరకపోవడం చూశాక గ్రామ ప్రజలంతా కలసి చర్చించుకుని స్వామి విగ్రహాన్ని తమ ప్రాంతంలోనే ప్రతిష్టించాలని నిర్ణయించుకున్నారట. అయితే ఆ కొండపైనే శిథిలావస్థలో ఓ ఆలయం ఉండటంతో దాన్నే పునర్ నిర్మించేందుకు పూనుకున్నారు.

ఊరి వాళ్లంతా కలసి ఆలయ నిర్మాణానికి విరాళాలు సేకరించి ఆలయాన్ని నిర్మించి గర్భగుడిలో ప్రత్యేకమైన ఉత్సవాలు నిర్వహించారు. అంబరాన్నాశీటే గాలిగోపురం ముందు ఎదురుగా నిలువెత్తు ధ్వజస్తంభం.రాజగోపురం ముందు ఆంజనేయస్వామి గరుత్మంతుడు విగ్రహాలు మనకు దర్శనం ఇస్తాయి ఆ తర్వాత రాజగోపురం నుండి దేవాలయంలోనికి ప్రవేశిస్తే.. సుందరమైన పచ్చిక పరుపు వేసినట్లుగా ఉంటుంది. దేవలమ్మ తల్లి. అమ్మవారు చెరువుగట్టునే ఉంటారు



భక్తులు ముందుగా దేవలమ్మ చెరువులో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుంటారు. ఆ తర్వాతనే స్వామివారి దర్శనానికి వెళ్తారు.

ఇక్కడ రోజువారీ చేసే పూజలతోపాటు ప్రతి ఏకాదశి నాడు స్వామికి అభిషేకం, సుదర్శన నారసింహ యాగం నిర్వహిస్తారు. వైకుంఠ ఏకాదశికి మూడు రోజులపాటు ప్రత్యేకంగా బ్రహ్మోత్సవాలను జరపడం విశేషం. ఆ సమయంలో నిర్వహించే స్వామి కల్యాణాన్ని చూసేందుకు రెండు కళ్లూ చాలవంటారు. ఈ ప్రాంగణంలోనే వినాయకుడు, దాసాంజనేయస్వామి ఉపాలయాలనూ దర్శించుకోవచ్చు. ఇక్కడున్న హనుమంతుడి విగ్రహం కూడా సింగనూరు అనే ప్రాంతంలో దొరికిందని చెబుతారు.

## ఇలా చేరుకోవచ్చు

హైదరాబాద్లోని వివిధ ప్రాంతాల నుంచి చౌటుప్పల్ వరకూ ఆర్టీసీ బస్సుల్లో చేరుకుంటే.. అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు ఆటోలు అందుబాటులో ఉంటాయి.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# అంధుల పాలిట ఆరాధ్య దైవం

- ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు
- బొడ్డు శ్రీను



**నవతర-శ్రీకాకుళం**

లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట ఆరాధ్య దైవమని బొడ్డు శ్రీను అన్నారు. ఆదివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బొడ్డు శ్రీను మాట్లాడుతూ బ్రెయిలీ జయంతి ప్రతి సంవత్సరం జనవరి 4వ తేదిన జరుపుకుంటామన్నారు. అంధులకు అక్షర జ్ఞానాన్ని అందించిన బ్రెయిలీ లిపిని కనుగొన్న మహోన్నత వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని అన్నారు. దృష్టిలోపం ఉన్నవారికి బ్రెయిలీ లిపి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్పర్శజ్ఞానంతో ద్వారా అంధులు చదవడానికి, రాయడానికి వీలైన బ్రెయిలీ లిపిని కనిపెట్టి, అంధుల జీవితాల్లో వెలుగులు నింపి, విద్య ద్వారా సమాజంలో భాగస్వాములు కావడానికి తోడ్పడిన మహనీయుడని లూయిస్ బ్రెయిలీ అని అన్నారు. అంధుల లూయిస్ బ్రెయిలీని ఎప్పుడూ గౌరవిస్తూ ఉంటామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, లూయి బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.



# సలార్ మిస్సయింది.. రాజాసాబ్ సెట్ అయింది

సలార్ లో ప్రభాస్ సరసన శృతిహాసన్ హీరోయిన్ గా నటించింది. అయితే లెక్కప్రకారం, ఆ పాత్ర చేయాల్సింది శృతిహాసన్ కాదు. సలార్ లో ఫిమేల్ లీడ్ పోషించే అవకాశం ముందుగా తనకొచ్చిందని అంటోంది మాళవిక మోహనన్."నిజానికి నాకు సలార్ కే పిలుపొచ్చింది. లీడ్ పాత్ర కోసం నన్ను అడిగారు. నేను వెళ్లి ప్రశాంత్ నీల్ ను కలిశాను. అంతా బాగానే జరిగింది. కానీ కొన్ని కారణాల వల్ల అది వర్కవుట్ కాలేదు. అప్పుడు చాలా బాధేసింది."సలార్ ఛాన్స్ మిస్సవ్వడంతో తట్టుకోలేకపోయిందంట మాళవిక. అలా బాధపడుతున్న టైమ్ లోనే 6-8 నెలలకే రాజాసాబ్ లో హీరోయిన్ గా ఛాన్స్ వచ్చినట్టు వెల్లడించింది. అప్పుడు చాలా సంతోష పడిందంట.

ప్రభాస్ ను తనను ప్రకృతి కలిపిందని గతంలో తను ఓ స్టేట్ మెంట్ ఇచ్చానని, అప్పుడు అలా స్టేట్ మెంట్ ఇవ్వడానికి ఇదే కారణమని తెలిపింది మాళవిక. తనను ప్రభాస్ ను విధి కలిపిందని అంటోంది.రాజాసాబ్ సక్సెస్ అయితే టాలీవుడ్ లో చక్రం తిప్పాలని ఆశపడుతోంది మాళవిక. అందుకే ఈ ఏడాది న్యూ ఇయర్ సంబరాలు కూడా పక్కనపెట్టి మరీ రాజాసాబ్ కు ప్రచారం చేస్తోంది.

# 2026 తండ్రీకొడుకులిద్దరికీ కీలకం



న్యూ ఇయర్ లో నిరూపించుకోవాల్సిన హీరోలు చాలామంది ఉన్నారు. మరీ ముఖ్యంగా ఈ రేసులో తండ్రీకొడుకులు కూడా ఉండడం విశేషం. ముందుగా మెగా కాంపౌండ్ విషయానికొస్తే.. చిరంజీవి-రామ్ చరణ్ ఇద్దరికీ ఈ ఏడాది కీలకం.భోళాశంకర్ దెబ్బకు ఊహించని విధంగా చిరంజీవి కెరీర్ లో గ్యాప్ వచ్చేసింది. కొన్ని సినిమాలు పక్కనపెట్టారు, మరికొన్ని ఫైనల్ చేశారు. విశ్వంభర టీజర్ లో గ్రాఫిక్స్ పై వచ్చిన నెగెటివిటీతో ఆ సినిమా వెనక్కు వెళ్లిపోయింది.అలా గతేడాది మొత్తం చిరంజీవి నుంచి సినిమానే రాలేదు. ఇప్పుడు 2026లో మనశంకర వరప్రసాద్ సినిమాతో థియేటర్లలోకి వస్తున్నారు చిరు. ఈ సినిమాతో ఆయన తప్పనిసరిగా హిట్ కొట్టాల్సిందే.చిరంజీవి తనయుడు రామ్ చరణ్ ది కూడా ఇదే పరిస్థితి. గతేడాది గేమ్ ఛేంజర్ రిలీజ్ చేశాడు చరణ్. కానీ ఆ సినిమా ఫ్లాప్ అయింది. దీంతో అతడిపై ఒత్తిడిపై పెరిగింది. ఆ ఒత్తిడి పెద్ది సినిమాపై పడింది. ఈ సినిమాతో చరణ్ కూడా తప్పనిసరిగా హిట్ కొట్టాలి. లేదంటే ఆయన పాన్ ఇండియా ఇమేజ్ దెబ్బతింటుంది.అక్కినేని కాంపౌండ్ లో నాగార్జున, అఖిల్ ది కూడా ఇదే పరిస్థితి. నాగార్జున సోలోగా హిట్ కొట్టి చాన్నాళ్లయింది. అటు అఖిల్ కూడా మంచి హిట్ కోసం వెయిటింగ్. ఈ తండ్రీకొడుకులిద్దరూ ఇదే ఏడాది థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉంది. అఖిల్ చేస్తున్న లెనిన్ సినిమా ఈ ఏడాది కచ్చితంగా థియేటర్లలోకి వస్తుంది.అటు నాగార్జున ప్రతిష్టాత్మక వందో చిత్రం చేస్తున్నారు. పెద్దగా గ్రాఫిక్ వర్క్ లేకపోతే నాగ్ సినిమా కూడా ఈ ఏడాదిలోనే రిలీజయ్యే అవకాశాలున్నాయి.మెగా తండ్రీకొడుకులు, అక్కినేని తండ్రీకొడుకులు సక్సెస్ కోసం ప్రయత్నిస్తుంటే.. నందమూరి తండ్రీకొడుకులది మరో కథ. అఖండ-2 దెబ్బకి బాలకృష్ణ తన కొత్త సినిమా కథ మార్చుకున్నట్టున్నారు. హిస్టారికన్ టచ్ ఉన్న కథను పక్కనపెట్టి, మరోసారి మాస్ కథను ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. సినిమాని చకచకా పూర్తిచేసే బాలయ్య, కచ్చితంగా ఈ ఏడాది థియేటర్లలోకి వస్తారు.మరి మోక్షు సంగతేంటి? ఇప్పటికే ఓ సినిమాను ప్రారంభించి మరీ పక్కనపెట్టారు. ఈ ఏడాది మోక్షజ్ఞ కచ్చితంగా మరో సినిమా స్టార్ట్ చేస్తాడు. మరి ఆ మూవీ కూడా ఈ ఏడాదిలోనే రిలీజైతే, బాలకృష్ణ-మోక్షజ్ఞ కూడా థియేటర్లలోకి వచ్చినట్టవుతుంది.

# గ్రామ కంఠ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

## అంతర్జాతీయ మానవహక్కుల స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు



**నవతరం-శ్రీకాకుళం**

హిరమండలం మండలంలోగల రుగడ సచివాలయం పరిధిలో ఎం అవలంగి గ్రామంలో కోట్ల విలువైన గ్రామ కంఠ భూమిని కబ్జా చేసిన ఎం. ఎల్. ఎ. అనుచరుడు లోలుగు వేణుగోపాల్ పై తక్షణమే చర్యలు తీసుకొని విలువైన భూమిని కాపాడాలని అంతర్జాతీయ మానవహక్కుల స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే ఎం అవలంగి గ్రామంలో ఎన్నో విలువైన భూములను మండల రెవిన్యూ అధికారి అండతో ఎం అవలంగి వి ఆర్ ఒ సహకారం తో కబ్జా చేశారని ఇప్పటికైనా గ్రామ కంఠ మరియు బంజరు భూములను స్వాధీనం చేసుకొని కాపాడాలని లేనియెడల జిల్లా కలెక్టర్ గారి పైన డి. ఓ. పి.టి మరియు సెంట్రల్ ఎ సి బి వారికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఎం ఎల్ ఎ అండతో చేసిన ఆగత్యాలు అన్నీ ఇన్ని కావని డెమోక్రసీని అడ్డుపెట్టుకొని దోచుకుంటున్న వారిపై తక్షణమే యంత్రాంగం క్రిమినల్ చర్యలు చేపట్టాలని లేని యెడల ఉద్యమం చెపడతామని స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు డిమాండ్ చేశారు.

# ఆదర్శమూర్తి శ్రీరామమూర్తి



**నవతరం-శ్రీకాకుళం**

బుడుమూరు శ్రీరామమూర్తి నేటి సమాజానికి ఆదర్శనీయుడని ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నరసింహులు పేర్కొన్నారు. సోమవారం ఇస్కఫ్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామమూర్తి సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామమూర్తి తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు చూసిన వ్యక్తి అన్నారు. శ్రీరామమూర్తి సమాజం పట్ల దయ, జాలి, ప్రేమ, అభిమానం కలిగిన వ్యక్తిగా ప్రస్తుతించారు. అనునిత్యం ప్రజల కష్టసుఖాల్లో నిలుస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో శ్రీరామమూర్తి ముందుంటారన్నారు. ఈ సందర్భంగా ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ శ్రీరామమూర్తి కళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షునిగా, ఇస్కఫ్ గౌరవ అధ్యక్షునిగా ఎనలేని సేవలు చేశారన్నారు. ప్రముఖ వ్యక్తి, ఉమ్మడిమదరాసు రాష్ట్రంలో విద్యాశాఖామంత్రి, స్పీకర్ గా పనిచేసిన మహోన్నతుడు సర్ అన్నెపు పరుశు రాం పాత్రో జీవిత చరిత్ర పుస్తక రూపంలో తీసుకురావడంలో ఎంతో కృషి చేశారన్నారు. రచయిత గూన అప్పారావు అద్భుతంగా రచించిన పరుశురాం పాత్రో జీవిత చరిత్ర పుస్తకాన్ని ఈ సందర్భంగా శ్రీరామమూర్తి పలువురికి అందించారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఇస్కఫ్ గౌరవ అధ్యక్షులు వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ కోఆర్డినేటర్ గేదెల ఇందిరప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామమూర్తి ఉన్నతమైన విలువలు కలిగిన వ్యక్తిగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఇస్కఫ్ ఉపాధ్యక్షులు సీపాన రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గురువుపల్లి నాగభూషణరావు, వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ విశాఖపట్నం జోనల్ చైర్ పర్సన్, స్టార్ వనిత వాకర్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు గేదెల లక్ష్మి, హనుమంతు మల్లేశందొర, ఆర్ అండ్ బి ఉద్యోగిని పేడాడ కల్యాణికుమారి తదితరులు పాల్గొన్నారు.

# కోట చిన్న బాబుగారు ఇక లేరు...!



**నవతరం-టెక్కలి**

సంఘసేవకులు అభ్యుదయ భావాలు కలిగిన ప్రజల మనిషి ఇక లేరు అనే వార్త దిగ్భ్రాంతిని కలిగించింది.....! టెక్కలి మండలం పెద్దసాన మాజీ సర్పంచ్, ల్యాండ్ లార్డ్, రైతు నాయకులు, సంఘ సేవకులు, బిఎస్అండ్ జె ఆర్ విద్యా సంస్థల అధినేత శ్రీ కోట చిన్నబాబు గారు(కోట మురళీధర్ తండ్రి గారు) ఈ రోజుసోమవారం పరమ పదిశీచారన్నవార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురైఅయ్యింది టెక్కలి నియోజకవర్గం. నియోజకవర్గ పెద్దసాన స్వగృహంలో వారి పార్థివ దేహానికి సందర్శించి ఘనంగా నివాళులు అర్పించి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన కేంద్ర మాజీ మంత్రి శ్రీమతి డా కిల్లి కృపారాణి దంపతులు.

# యువ మోర్చా జిల్లా అధ్యక్షునిగా దన్నాన మదన్ మోహన్ రావు

- జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు
- పలువురు రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో ఘనంగా కార్యక్రమం

**(నవతరం శ్రీకాకుళం)**

భారతీయ జనతా పార్టీ శ్రీకాకుళం జిల్లా యువ మోర్చా జిల్లా అధ్యక్షునిగా దన్నాన మదన్ మోహన్ రావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శు క్రవారం శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబు, సెవ్వనా ఉమామహేశ్వరీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పెడాడా సూరపునాయుడు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బడే తాతారావు, బీజేపీ నాయకులు పోకతోట సింహాచలం, శ్రీకాకుళం ఈస్ట్ మండల అధ్యక్షులు కనుగుల లలిత కుమారి, సెంట్రల్ మండల అధ్యక్షులు టేకి మాధవ్, రూరల్ మండల అధ్యక్షులు గొల్లంగి అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.
యువతను సమన్వయంతో ముందుకు నడిపిస్తూ శ్రీకాకుళం జిల్లాలో యువ మోర్చా బలోపేతానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, బీజేపీ శ్రీకాకుళం జిల్లా కమిటీ శ్రీ దన్నాన మదన్ మోహన్ రావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసింది.



# ఏపీఎంఎఫ్ సంక్రాంతి కానుక

**(నవతరం, శ్రీకాకుళం)**

ఏపీఎంఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సంక్రాంతి కానుకల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తొలుత డా. సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతతోనే సమాజానికి సరైన దిశానిర్దేశం సాధ్యమవుతుందని తెలిపారు. జర్నలిస్టుల సంక్షమానికి ఏపీఎంఎఫ్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. తదనంతరం సనపల సత్యవతి మాట్లాడుతూ, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సమిష్టిగా ఎదుర్కొనాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంతో పాటు సమాజం కూడా జర్నలిస్టుల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా చెందిన సుమారు 100 మంది జర్నలిస్టులకు ఏపీఎంఎఫ్ ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకలు



అందజేశారు.
కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శాసపు జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్ రావు, నల్లి ధర్మారావు, ఏపీఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డోల అప్పన్న, జిల్లా అధ్యక్షుడు పేడాడ హేమసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిత్తి ప్రవీణ్ కుమార్, ట్రెజరర్ ఆకుల మాధవ్, గౌరవాధ్యక్షుడు ఆర్.వి. పట్నాయక్, సహాయ కార్యదర్శులు అద్దంకి సురేష్, బొడ్డేపల్లి రామయ్య, లీగల్ అడ్వైజర్ గుండాల మోహన్, కార్యవర్గ సభ్యులు ఆతి బేగ్, వి. రాము, ఎస్. అప్పలనాయుడు, రాంబాబు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధికి మెరుగైన హామీ వీబీజీ రామ్ జి




**నవతరం-టెక్కలి**

గ్రామీణ ఉపాధికి మెరుగైన హామీ వికాసిత్ భారత్ జి రామ్ జి అని సర్పంచ్ బగాది దమయంతి అన్నారు. మండలంలోని స్థానిక తొలుసూరుపల్లి గ్రామంలో 125 రోజుల గ్రామీణ ఉపాధికి మెరుగైన హామీలను కూటమి నాయకులతో కలిసి ప్రజలకు అవగాహన పై గ్రామ సభ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పమే ఈ వికాసిత్ భారత్ జి రామ్ జి తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న 100 రోజుల పని దినాలుని 125 కు పెంచుతూ గ్రామంలో ఉన్న ప్రతి కార్మికులకు పనులు దొరికే విధంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చారని, ఏ ఒక్కరూ ఎలాంటి అపోహలో పడకూడదని అన్నారు. ఉపాధి హామీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ఈ సభలో గ్రామానికి అవసరమైన పనులు నీటి భద్రత, సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధి మెరుగుదల, వాతావరణ మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనే పనులు పై గ్రామస్తులతో కలిసి చర్చించుకున్నారు. పారిశు ద్ధ్యం, వ్యవసాయం, పశువుల పెంపకం, గ్రామీణ రహదారులు అభివృద్ధి చేసే విధంగా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నూక కనకాచలం, బిజెపి మండల అధ్యక్షులు మరియు కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జర్జాన రాంజీ, పంచాయతీ సెక్రటరీ హరికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ దుప్పల రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు గుణ మీనా కుమార్,గుణ వేణు,గుణ మన్మధ, తమ్మినేని ఆనందరావు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి ఎంపికలు

**నవతరం-శ్రీకాకుళం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఖేలో ఇండియా ట్రైబల్ క్రీడలు-2026'లో భాగంగా రాష్ట్రస్థాయి గిరిజన క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 8వ తేదీన కాకినాడలో జరగనున్నాయి. ఓపెన్ ఏజ్ కేటగిరీలో పురుషులు, మహిళలకు నిర్వహించే ఈ ఎంపికల్లో అథ్లెటిక్స్, ఆర్చరీ, స్విమ్మింగ్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, హాకీ, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని శ్రీకాకుళం జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డీఎస్డీఓ) ఏ. మహేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన గిరిజన క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ స్వంత క్రీడా పరికరాలతో ఈ నెల 8న ఉదయం 9 గంటలకు కాకినాడ జిల్లా క్రీడా ప్రాంగణంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. హాజరయ్యే వారు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎస్.టి. కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు నకలు మరియు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను వెంట తీసుకురావాలి. ఇక్కడ ఎంపికైన



క్రీడాకారులు జాతీయ స్థాయి ఖేలో ఇండియా ట్రైబల్ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఇతర వివరాల కోసం 9985113210 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**